70 శాతం పూర్తి చేసినా పాడుబెట్టారు..

2017 చివర్లో రూ.160 కోట్లతో అప్పటి టీడీపీ ప్రభుత్వం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి దాదాపు 70శాతానికి పైగా పనులను పూర్తి చేశారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధాని లోని భవనాల నిర్మాణ పనులను నిలిపివేసింది. తుది మెరు గులతో ఉపయోగించుకునే అవకాశం ఉన్నా సీఆర్‌డీఏ కార్యాలయ భవనాన్ని వైసీపీ పాలకులు పాడుబెట్టారు.

అలుమ్నికి.. ఆటంకాలు

- బాపట్ల ఏజీ కళాశాలలో అనేక సమస్యలు
- నిధులు సమకూర్చడానికి పూర్వ విద్యార్థుల ఆసక్తి
- ఎన్జీ రంగా యూనివర్సిటీ పెద్దల నుంచి కనబడని చొరవ
- నేడు అలుమ్ని హౌస్ మొదటి అంతస్తు ప్రారంభోత్సవం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

'ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు మూలాలు మరిచిపోకూడదు. ఎంతోకొంత వితరణ రూపంలో ఇవ్వడం సామాజిక బాధ్యతగా భావించాలి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు వేదికలపై చెప్తుంటారు. చంద్రబాబు స్ఫూర్తితో ఎందరో పుట్టిపెరిగిన గ్రామాలకు.. విద్య నేర్పి తమను ఉన్నత స్థాయికి చేర్చిన పాఠశాల, కళాశాలకు తమవంతు బాధ్యతగా కొన్ని పనులు చేపట్టి వాటి అభివృద్ధికి దోహదపడుతున్నారు. ఈ క్రమంలో దాతలను గ్రామ పెద్దలు, విద్యా సంస్థల నిర్వాహకులు ప్రత్యేకంగా ఆదరిస్తూ అభిమానిస్తూ.. వారి పట్ల కృతజ్ఞతగా ఉంటున్నారు. అయితే ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ పెద్దల తీరు ఇందుకు భిన్నంగా ఉంది. వర్సిటీ పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్య అభ్యసించి వ్యవసాయ రంగంలోనే కాకుండా శాస్త్ర, రాజకీయ, పాలన, ఆర్థికరంగంలో తమదైన ముద్రవేసిన వారు సాగుబడిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిధులను సమకూరుస్తున్నారు. వారిచ్చిన రూ.2 కోట్ల విరాళాలతో నిర్మాణం పూర్తి చేసుకున్న అలుమ్ని హౌస్ మొదటి అంతస్తు బుధవారం ప్రారంభం కానుంది. అయితే ఆయా నిధులు సమకూర్చిన పూర్వ విద్యార్థులకు వర్సిటీ నుంచి కనీస ప్రాధాన్యం దక్కడంలేదన్న విమర్శలున్నాయి. పూర్వ విద్యార్థులను ఓ చోటకు చేర్చి కళాశాల అభివృద్ధికి సహకారం కోరడంపై కూడా వర్సిటీ పెద్దల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాలకు స్వచ్ఛందంగా నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారి విషయంలో కనీస గుర్తింపు ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండటంపై కూడా విమర్శలు వస్తున్నాయి. పోతన హాస్టల్ భవనం ఆధునికీకరణకు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, శ్రీహరిరెడ్డి ముందుకు రాగా వారి కోరికకు సానుకూల స్పందన లేకపోవడంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన గోవింద రాజులు నాబార్డ్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కళాశాలకు అగ్రిహబ్‌ను మంజూరు చేశారు. అయితే అప్పట్లో ఉన్న వీసీ దీనికి అంగీకరించలేదు. దీంతో ఈ అగ్రిహబ్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు తరలిపోయింది. పూర్వ విద్యార్థి ఒకరు కళాశాలలోని పెవిలియన్ ఆధునికీకరణను దాదాపు రూ.15 లక్షలు వెచ్చించారు. 1980 బ్యాచ్‌కు చెందిన హరిప్రసాద్ రైతు సమాచార కేంద్రం నిర్మాణానికి భూరి విరాళం ఇచ్చారు. ఇలా భారీ విరాళం ఇచ్చిన వారి పేర్లను సదరు విభాగాలకు పెట్టడం వల్ల మరింత మంది పూర్వ విద్యార్థులు ముందుకు రావడానికి ప్రేరణ ఇచ్చినట్లవుతోంది. కానీ ఈ విషయంలో కూడా నిబంధనల పేరుతో వారికి సముచిత గౌరవం ఇవ్వడంపై కూడా యూనివర్సిటీ నిర్లక్ష్యం ప్రదర్శించడంతో విమర్శలను (మిగతా 8వ పేజీలో)



అలుమ్ని హౌస్ ఇదే

ఆరోగ్య శాఖలో అవినీతి కంపు

- నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు
- గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారి లీలలు
- స్పెషల్ చీఫ్ సెక్రటరీ కి ఫిర్యాదు చేసిన యూనియన్ నేతలు

మండల పరిషత్ నిధుల పెంపు

- 15 శాతం నుంచి 20 శాతానికి పెంపు
- జీవో 25 విడుదల చేసిన పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి

6

రైళ్ల సమయ పాలనలో నెంబర్ 10

8



ఎక్స్‌కవేటర్‌తో మల్లాది రీచ్‌లో లారీలు, ట్రాక్టర్‌లకు ఇసుక లోడింగ్



- నిర్మాణంలో ఉన్న ఏపీ సీఆర్‌డీఏ పరిపాలనా భవనం

సిద్ధమవుతున్న సీఆర్‌డీఏ భవనం

- ఇందులోనే ఏడీసీఎల్ కార్యాలయం
- జీ ప్లస్ 7గా నిర్మాణం.. నెల రోజుల్లో పూర్తి
- రాజధాని అమరావతిలో మొదటి ప్రభుత్వ భవనం ఇదే

అత్యద్భుతంగా.. ఆకర్షణీయంగా.. అత్యాధునికంగా.. సకల సౌకర్యాలతో.. అమరావతి రాజధానిలో మొట్టమొదటి ప్రభుత్వ భవనంగా సీఆర్‌డీఏ కార్యాలయం సిద్ధమవుతోంది. సీడ్ యాక్సిస్ రోడ్డుకు దక్షిణంగా ఎన్-8, ఎన్-9ల మధ్య చేపట్టిన ఈ భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ భవనం మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. రాజధాని అమరావతిలో ప్రతీ నిర్మాణం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో...అత్యంత వైవిధ్యంగా... మరెంతో ఆకర్షణీయంగా.. ప్రత్యేకంగా కనిపించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యాలయ భవనాన్ని అమరావతిలో ఓ రోల్‌మోడల్‌గా నిలిచేలా సీఆర్‌డీఏ అధికారులు నిర్మిస్తున్నారు. గత టీడీపీ హయాంలోనే 70 శాతం నిర్మాణం పనులు పూర్తి కాగా తిరిగి చంద్రబాబు గత ఏడాది ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ భవనానికి పునః శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఏప్రిల్ మూడో వారంలో రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభాన్ని ప్రధాని నరేంద్ర మోదీతో ప్రారంభించే సమయానికల్లా సీఆర్‌డీఏ కార్యకలాపాలను రాజధాని నుంచే ఆరంభించాలన్న లక్ష్యంతో ఈ భవన నిర్మాణాన్ని వేగంగా చేపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

ఆంధ్రుల కలల రాజధాని అమరావతిలో మొట్టమొదటి ప్రభుత్వ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైపోతుంది. రాజధాని అమరావతి నిర్మాణపనుల పర్యవేక్షణ బాధ్యతలను తలకెత్తుకున్న ఏపీ సీఆర్‌డీఏ తన ప్రధాన కార్యాలయ భవనాన్ని అన్నింటికన్నా ముందే ఏర్పాటు చేసుకునేందుకు శరవేగంగా అడుగులు వేస్తోంది. రాజధాని అమరావతిలో గవర్నమెంటు కోర్‌లో ఒక వైపుగా సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి రాయపూడికి దగ్గర్లో సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం జీ+సెవెన్ భవనంగా.. అన్ని హంగులతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటుంది. సీఆర్‌డీఏకు కేటాయించిన మూడు ఫ్లోర్లకు సంబంధించి ఇంటర్నల్ వర్కులు దాదాపు 90శాతం వరకు పూర్తయ్యాయి. సీఆర్‌డీఏ కార్యాలయం ప్రస్తుతం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో, ఏడీసీ కార్యాలయం కేదారేశ్వరరావుపేటలో ఉన్నాయి. ఈ రెండు ముఖ్య కార్యాలయాలను అమరావతిలో నిర్మిస్తున్న ఈ భవన ప్రాంగణంలోకి శాశ్వత ప్రాతిపదికన తరలించనున్నారు. రెండు ప్రధాన కార్యాలయాలు ఒకేచోట ఉండటం వల్ల పరస్పర అవగాహనతో పాటు మంచి పాలనా సౌలభ్యం కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది.

నిర్మాణం ఇలా..

3.41 ఎకరాలు కేటాయించగా 1.10 ఎకరాల్లో భవనాన్ని జీ+7 రూపంలో ప్రీ కాస్ట్ విధానంలో నిర్మిస్తున్నారు. భవనం పోను మిగిలిన స్థలాన్ని ఉద్యానవనాలు, పార్కింగ్ కోసం వినియోగించేలా ప్లాన్ చేశారు. ఒక్కొక్క ఫ్లోర్‌ను 30,500 చదరపు గజాల విస్తీర్ణం (మిగతా 8వ పేజీలో)

జనం మెచ్చిన డిజైన్‌తోనే..

సీఆర్‌డీఏ కార్యాలయ భవనానికి ఔట్‌పుట్ డిజైన్‌కోసం పది రకాల డిజైన్లను రూపొందించారు. వీటిలో ఏదీ బెస్ట్ అంటూ పబ్లిక్ డొమైన్‌లో ఉంచగా ఎక్కువమంది పదో రకం వైపు మొగ్గు చూపారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు ఆ డిజైన్‌ను ఖరారు చేసి నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఒకటి, రెండు ఫ్లోర్లకు సంబంధించి గ్లాస్‌వర్క్ చేస్తున్నారు. భవనానికి నాలుగువైపులా ఈ గ్లాస్ వర్క్ పూర్తయిన తర్వాత భవనానికి ప్రధాన ఔట్‌లుక్‌గా ఉన్న తూర్పువైపున పదో రకం మోడల్ డిజైన్‌ను దాని మధ్యలో అమరావతికి చిహ్నంగా ఇంగ్లీషు అక్షరం ఏ ప్రతిబింబించేలా ఎలివేట్ చేస్తారు.



మల్లాదిలో.. ఇసుక దందా

- అక్రమార్కులకు నేతల అండ
- వైసీపీని మించి యథేచ్ఛగా తవ్వకాలు
- ఏకంగా నదిలోకి లారీలు.. ఎక్స్‌కవేటర్‌తో లోడింగ్
- నిత్యం వేల టన్నుల తరలింపు.. పట్టించుకోని అధికారులు

పెదకూరపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలంలోని మల్లాది ఇసుక మాఫియాకు అడ్డాగా మారింది. అధికారం అండతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. వైసీపీ హయాంలో జరిగిన దానికి మించి ఇక్కడ ప్రస్తుతం ఇసుక దందా సాగుతున్నది. కృష్ణానదిలో ఎక్స్‌కవేటర్‌తో లారీలకు ఇసుకను నింపుతున్నా అధికారులకు కనిపించడంలేదు. నిత్యం వేలాది టన్నుల ఇసుకను తరలిస్తున్నా మైనింగ్ శాఖ చేతులెత్తేసింది. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఇక్కడి నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. ఓ నేత అండతో ఇసుక అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అధిక లోడుతో తరలిపోతున్న లారీలను రవాణా, పోలీస్ శాఖలు అడ్డుకోవడంలేదు. అధిక లోడు లారీల కారణంగా రహదారులు కూడా ధ్వంసమవుతున్నాయి. రీచ్‌లకు గతంలో ఇచ్చిన గడువు ముగియడంతో ప్రభుత్వం తాజాగా కసరత్తు చేస్తుంది. అయితే కొందరు అధికార పార్టీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌లో రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్ ద్వారా ఇసుక తవ్వి లారీలకు లోడింగ్ చేసి తరలిస్తున్నారు. ఇదంతా అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో జరుగుతుండటంతో అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గతంలో మల్లాది రీచ్ నుంచి ట్రాక్టర్ల ద్వారా కృష్ణానదీ సమీప ప్రాంతంలో డంపింగ్ చేసి అక్కడ నుంచి రాత్రి వేళల్లో లారీలకు లోడింగ్ చేసేవారు. ఇప్పుడు నేరుగా నదిలోనే లారీలకు లోడింగ్ చేస్తుండటం వారి బరితెగింపునకు నిదర్శనంగా కనిపిస్తోంది. ట్రాక్టర్‌కు రూ600, లారీకి రూ4000 వసూలు చేస్తున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు.



అందని ఉచిత ఇసుక

ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక జిల్లాలో ఎక్కడా లభిస్తున్న దాఖలాలు లేవు. పేరుకే ఉచిత ఇసుక ఆచరణ మాత్రం శూన్యంగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు. టన్ను ఇసుకకు రూ.850 నుంచి 950 వసూలు చేస్తున్నారు.

నాడు బారాబందీ నేడు వారబందీ



నెమలిపురి ప్రాంతంలో కంకి దశలో ఉన్న వరి పొలం

నీటి అవసరంపై నివేదిక

కొన్ని ప్రాంతాల్లో వరి కంకి దశలో ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో పొట్ట దశలో ఉండగా మరి కొన్ని ప్రాంతాల్లో ఆ దశలో కూడా లేదు. కొన్ని ప్రాంతాలకు 10 వరకు.. మరి కొన్ని ప్రాంతాల్లో 15 వరకు నీరు అవసరం ఉందని ప్రాంతాల వారీగా నీటి అవసరంపై జలవనరుల శాఖకు నివేదిక అందించాం. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల వివరాలను కూడా తెలియజేశాం.

- ఐ మురళీ, వ్యవసాయ శాఖ జేడీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- నెల క్రితం విచ్చలవిడిగా నీటి విడుదల
- వాగుల్లోనూ వృథాగా పోయిన వైనం
- రైతులకు అవసర సమయంలో నిలిపివేత
- కుడి కాల్వకు 31 వరకే నీటి సరఫరా అంటూ ప్రకటన
- వచ్చే నెల 15 వరకు ఇస్తేనే పంట చేతికి అంటోన్న రైతులు
- ఇప్పటికే 7 వేల క్యూసెక్కులకు తగ్గిన నీటి విడుదల

పంటల అవసరానికి మించి కుడి కాల్వ ద్వారా ఇంతకాలం సాగు నీటిని విడుదల చేశారు. పంటలకు ఊపిరిపోయాల్సిన నీరంతా వృథాగా కాల్వల్లో పారింది. ఇప్పుడు పంట చేతికి వచ్చే సమయంలో నీటి విడుదలకు జలవనరుల శాఖ కట్టడి చర్యలు చేపట్టింది. నాడు నీరు వృథాగా పోతున్నా పట్టించుకోని అధికారులు ఇప్పుడు పంటలకు అవసరమైన సమయంలో వారబందీ అమలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుడి కాల్వకు విడుదల చేసే నీటిని మంగళవారం 7 వేల క్యూసెక్కులకు తగ్గించారు. బుధవారం నుంచి ఇంకా తగ్గించనున్నారు. ఈ నెల 31న పూర్తిగా నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. సాగునీరు ఈ నెలాఖరు వరకే అనడంతో ఆయకట్టులో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. వివిధ దశల్లో ఉన్న వరికి సాగు నీరు అందకపోతే పంట చేతికి వచ్చేనా అన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొంది. కనీసం వచ్చే నెల 10 నుంచి 15వ తేదీ వరకైనా సాగు నీరు ఇస్తేనే పంట చేతికి వస్తుందని లేకుంటే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల 15 వరకు సాగునీరు అవసరం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల వివరాలను జలవనరుల శాఖకు పంపింది. అయితే నెలాఖరు వరకే సాగు నీటి సరఫరా ఉంటుందని జలవనరులశాఖ అధికారులు ప్రకటించారు. ఇదే జరిగితే వేలాది మంది రైతులు పంట కోల్పోయి దారుణంగా నష్టపోయే అవకాశం ఉంది. అయితే ఒక్క ఎకరంలో కూడా పంట ఎండిపోవడానికి వీలు లేదని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు జలవనరుల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ ప్రకటన అమలు కావాలంటే వచ్చే నెల 15 వరకు సాగునీటి సరఫరా చేయాల్సిందే. నీటి విడుదల కొనసాగించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీరివ్వకుంటే నష్టం

నీరు ఫలానా తేదీ వరకే అని ముందే చెబితే సాగుపై ఆలోచించే వాళ్లం.. తీరా వరి సాగు చేపట్టిన తర్వాత నీటి విడుదల చేయమని చెప్తే ఎలా అని రైతులు చెప్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు ముందస్తుగా మార్చి 31 వరకే సాగు నీరు అని ప్రకటించి ఉంటే రైతులు సాగు విషయంలో ఆలోచన చేసి ఉండేవారు. ఖరీఫ్‌లో ముందస్తుగా కోతలు పూర్తియిన చేలల్లోనే వరి సాగు చేసుకుని ఉండేవారు. అలా కాకుండా నీటి సరఫరాపై నాడు ప్రకటన చేయకుండా నేడు 31 వరకే అని జలవనరుల శాఖ నిర్ణయించడాన్ని రైతులు తప్పు పడుతున్నారు. ఆయకట్టు పరిధిలో 52,818 ఎకరాల్లో రెండో పంటగా వరి సాగు చేశారు. నకరికల్లు.. రాజుపాలెం మండలాల్లో కంకి.. పొట్ట దశలో ఉంది. మిగతా ప్రాంతాల్లో పంట పొట్ట దశకు కూడా చేరుకోలేదు. కంకి వెళుతున్న సమయంలో నీటి సరఫరా నిలిచిపోతుండటంతో గింజ తాలుగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో మిరప పంటకు ఒక తడికి నీరు అవసరం ఉందని రైతులు తెలిపారు.

ముందుగానే తెలియజేశాం

కేఆర్ఎంబీ కుడి కాల్వకు ఇటీవల చేసిన నీటి కేటాయింపుల మేరకు 31 వరకే సాగు నీటి సరఫరా ఉంటుంది. మార్చి 31 వరకే నీటి సరఫరా ఉంటుందని ముందుగానే రైతులకు తెలియజేశాం. నీటి సరఫరా కొనసాగించే అవకాశం లేదు. రైతులు పొదుపుగా నీటిని వినియోగించుకుని సహకరించాలి.

- కృష్ణమోహన్, జలవనరుల శాఖ ఎస్ఈ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (బుధవారం సాయంత్రం)

సహరి : 4.56 (గురువారం ఉదయం)

వాట్సాప్ పాలనతో కొత్త సంస్కరణలకు నాంది

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



అసెంబ్లీలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసు కొచ్చిన వాట్సాప్ పాలనతో కొత్తసంస్కరణలకు నాంది పలికిందని, వాట్సాప్ ద్వారానే 400 సేవలు అందించడంతో దేశంలోనే ఆంధ్రప్ర దేశ్ ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. బడ్జె ట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ మనమి త్ర ద్వారా ప్రజలకు మంచి మిత్రుడిగా సేవలు అంది స్తున్నందుకు మంత్రి లోకేశ్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తక్కువ చదివిన వారు కూడా ఈజీగా ఆపరేట్ చేసుకునేలా ఈ సేవలు ఉండటం అభినందనీయమన్నారు. ఇది తప్పనిసరిగా కోట్లమంది ప్రజలకు ఉపయోగపడుతుందని, పారదర్శకత, సుపరిపాలన, అవినీతి నియంత్రణలో ఎంతో మేలు చేస్తుందన్నారు. అధికా రుల్లో జవాబు దారీతనం పెరుగుతుందని, ప్రజలకు వేగంగా సేవలు అందు తాయని, దరఖాస్తు నుంచి పరిష్కారం వరకు అన్నీ నిర్ణీత సమయంలో పూర్తవుతాయని ఈ సందర్భంగా జీవీ తెలిపారు.

మండల పరిషత్ నిధుల పెంపు

● 15 శాతం నుంచి 20 శాతానికి పెంపు

● జీవో 25 విడుదల చేసిన పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి



గుంటూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల ప్రజా పరిషత్తుల పంట పండింది. ఇప్పటి వరకు కేటాయిస్తున్న నిధుల శాతాన్ని కూటమి ప్రభుత్వం ఆసాంతం పెంచేసింది. ఇప్పటివరకు మండల పరిషత్తులకు మొత్తం నిధుల్లో 15 శాతం మాత్రమే కేటాయించే వారు. గ్రామ పంచాయతీలకు 70 శాతం, జిల్లా పరిషత్‌లకు 15 శాతం నిధులను కేటాయించే వారు. అయితే జిల్లా పరిషత్‌లకు కేటాయించే 15 శాతంలో 5 శాతం కోత పెట్టి, మండల పరిషత్తుల వాటాను 20 శాతానికి పెంచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దానివల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల పరిషత్తు లకు ఎనలేని ప్రయోజనం చేకూరనుంది. ఈ నిర్ణయం వల్ల మండల పరిషత్‌లు ఆర్థికంగా బలోపేతం కావటంతో పాటు, మండల స్థాయిలో అభివృద్ధి పరుగులు పెడుతుంది.

ఆరోగ్య శాఖలో అవినీతి కంపు

- **నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు**
- **గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారి లీలలు**
- **స్పెషల్ చీఫ్ సెక్రటరికి ఫిర్యాదు చేసిన యూనియన్ నేతలు**



గుంటూరులోని వైద్య, ఆరోగ్యశాఖ ఆర్‌డీ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా ఆరోగ్యశాఖలోని లంచావతారుల లీలలు మాత్రం ఆగలేదు. గుంటూరులోని ఆరోగ్య శాఖ ఆర్డీ (రీజనల్ డైరెక్టర్)కార్యాలయంలో అవినీతి ఏరులై పారుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లా వైసీపీ నేతలను అడ్డంపెట్టుకుని పెట్రేగిపోయిన అధికారులు ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. అందిన కాడికి పుచ్చుకొని అడిగిన చోటికి బదిలీ చేసేందుకు చివరకు జీఓలను కూడా పూర్తిగా పక్కన పెట్టేస్తున్నట్లు తెలుస్తుంది. కార్యాలయంలోని ముఖ్య అధికారిణి సైతం ఈ విషయాల్లో పక్కదారి పట్టించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీకి పూర్తి అనుకూలంగా ఉన్న అధికారి ఆర్డీ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల యూనియన్ నేతలు స్పెషల్ చీఫ్ సెక్రటరిని కలిసి ఫిర్యాదు చేశారు. సదరు అధికారి చేసిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలను అందజేశారు.

- వేమలూరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్‌లను (మగ) నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడం జరిగింది.
- ఓజిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్‌ను జీవోకు విరుద్ధంగా పునర్విభజన పేరుతో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు బదిలీ చేయడం జరిగింది.
- కౌన్సెలింగ్ ప్రక్రియలో సీనియార్టీ జాబితా ఉన్న ఖాళీలు ముందుగానే ప్రకటించవలసినది. కానీ వాటన్నిటిని గోప్యంగా ఉంచి ఉద్యోగులను బలవంతంగా వివిధ ప్రాంతాలకు బదిలీ చేయటం జరుగుతుంది. ఆ తర్వాత ఉద్యోగులను వారికి అనుకూలమైన ప్రదేశంలో బదిలీ చేసేందుకు ముడుపులు చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు ఒక హెల్త్ విజిటర్‌ను సుదూర ప్రాంతానికి బదిలీ చేశారు. ఆమెకు రాపూర్‌లో తిరిగి పోస్టింగ్ ఇచ్చేందుకు ఎక్కువ మొత్తంలో నగదు తీసుకున్నారు. మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఈఓ బదిలీ విషయంలో కూడా అదే రీతిగా చేశారని ఆరోపించారు.
- జీవో నెంబర్ 32 ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పునర్విభజన జరగాల్సింది. దానికి విరుద్ధంగా పునర్విభజన ప్రక్రియ చేపట్టారు. ఒక ఎంపీహెచ్‌ఈఓను గురజాల నుంచి సత్తెనపల్లికి నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని వారు ఆరోపించారు.
- జీవో నెంబర్ 143 ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరి కన్నా ఎక్కువ సంఖ్యలో సంబంధిత క్యాడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను మాత్రమే సిబ్బంది లేని ప్రాంతానికి బదిలీ చేయాల్సి ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సింగిల్ కేడర్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లను లక్షల రూపాయలు పుచ్చుకుని వేరే చోటికి బదిలీ చేయటం జరిగిందని ఆరోపించారు.
- జీవో నెంబర్ 32 ప్రకారం సీహెచ్‌వో, ఎంపీహెచ్‌ఈవోల కౌన్సెలింగ్ లో 3:1 నిష్పత్తిని పాటించాల్సింది. అందుకు విరుద్ధంగా కౌన్సిలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేశారు.
- రీ- డిప్లెయిమెంట్ పేరుతో దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ధూపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయిన ఉద్యోగిని, మనుగడలో లేని నిడుముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన మరో హెల్త్ ఎడ్యుకేటర్‌ను ఇంకా ప్రారంభం కాని గుంటూరు జిల్లా మందడం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు.
- డిప్యుటేషన్‌లు రద్దు చేయమని స్పెషల్ చీఫ్ సెక్రటరి ఇచ్చిన ఉత్తర్వులను రీజనల్ డైరెక్టర్ కార్యాలయం లెక్క చేయలేదు.ఫిబ్రవరి నెలలో నెల్లూరు జిల్లా నుంచి హెల్త్ సూపర్‌వైజర్‌ను సంతమాగులూరుకు డిప్యుటేషన్ వేశారు. ఒంగోలు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్‌ను పల్నాడు జిల్లా దాచేపల్లికి డిప్యుటేషన్ వేశారు. నెల్లూరు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్‌ను పల్నాడు జిల్లా కోటప్పకొండ ప్రాథమిక కేంద్రానికి డిప్యుటేషన్ వేశారు.
- పబ్లిక్ హెల్త్ నర్స్ పదోన్నతుల్లో కూడా చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరు జిల్లా గవర్నమెంట్ ఆసుపత్రిలో పని చేస్తున్న హెడ్ నర్సుకు సుప్రీంకోర్టు ఉత్తర్వులను కాదని నోషనల్ సీనియార్టీని జారీ చేశారని వారు ఆరోపించారు. తుళ్లూరులో విధులు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ కోసం లేని ఆర్‌ఓఆర్ పాయింట్‌ను సృష్టించి పదోన్నతి కల్పిం చేందుకు రంగం సిద్ధం చేశారని సమాచారం.

ఉచిత విద్యుత్‌తో చేనేత కుటుంబాలకు ఊరట

- **హామీని నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేశ్**
- **పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య**
- **చేనేతకు ఉచిత విద్యుత్‌పై సర్వత్రా హర్షం**



చేనేత కార్మికులకు మిఠాయిలు పంచుతున్న నందం అబద్దయ్య, ధనుంజయరావు తదితరులు

మంగళగిరి సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల నివాసాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చేనేత కుటుంబాలకు ఆర్థికంగా ఊరట కలుగుతుందని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. చేనేత కార్మికులకు, పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల చేనేత వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. మంగళగిరి పట్టణంలోని 19, 20, 21, 22, 24, 26 వార్డుల్లో మంగళవారం సంబరాలు నిర్వహించారు. మగ్గాల షెడ్లలో కేకు కట్ చేసి చేనేత కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అబద్దయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 93 వేల మంది చేనేత కార్మికుల గృహాలు, 10,534 పవర్‌లూమ్ యూనిట్లకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. తొలినుంచి టీడీపీ ప్రభుత్వం చేనేతలకు అండగా నిలుస్తుందని, గతంలో నూలు, రంగులపై సబ్సిడీ, చేనేత సహాయ నిధి, పొదుపు నిధి, రంగుల కోసం రూ.25 కోట్లు, మూలధనం కింద రూ.30 కోట్లు, మరమగ్గాలకు 50 శాతం రాయితీకి రూ.80 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు రూ2 వేల చొప్పున 1.11 లక్షల మందికి పింఛన్ ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం చేనేతలకు మేలు చేస్తుందన్నారు. మంత్రి నారా లోకేశ్ సారధ్యంలో చేనేత రంగానికి పూర్వవైభవం రాబోతుందని చెప్పారు. 2024 నుంచి రాష్ట్రంలో చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎన్టీఆర్ పింఛన్ల భరోసా పథకం, త్రిఫ్ట్ ఫండ్, క్లస్టర్ల అభివృద్ధి, ముడి పదార్థాల సరఫరా, చేనేత మార్కెటింగ్ వంటి అంశాలపై దృష్టి సారించిందని తెలిపారు. ఎన్నికల ముందు చేనేతలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం పట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేతలు జంజనం వెంకట సుబ్బారావు, కందుల నాగార్జున, కారంపూడి అంకమ్మరావు, వింజమూరి ఆశాబాల, పడవల మహేష్, దామర్ల భిక్షారావు, ఒడిశా నరేష్, జంజనం శ్రీనివాసరావు, నందం బాబూరావు, వంగర రమేష్, కాశిన కొండలు, బలభద్ర రమేష్, పూట్ల శ్రీమన్నారాయణ, వుద్దంటి గాంధీ, గంజి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి రెండు రామమందిరాల వద్ద చేనేత మగ్గాల షెడ్డు వద్ద టీడీపీ పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కాండ్రు శ్రీనివాసరావు, గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు, వంగర లక్ష్మయ్య, రుద్ర మురళి, తన్నీరు కృష్ణ, గోసాల రాఘవ, కొల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించాలి

సిమెంటు కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, మార్చి,18 (ఆంధ్రజ్యోతి). సిమెంటు కంపెనీలకు పొలాలు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాల కల్పనలో భాగంగా ఒకరికి ఉపాధి కల్పించండని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సిమెంటు కంపెనీల ప్రతినిధులకు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార హాలులో కలెక్టర్ పొలాలు ఇచ్చిన రైతులు, భవ్య, చెట్టినాడ్ సిమెంటు కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీల యాజమాన్యాలు గ్రామస్తుల అవసరాలను గుర్తించి సి.యస్.ఆర్ నిధులు వినియోగించాలన్నారు. జిల్లా అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటు అవసరమన్నారు. భవ్య, చెట్టినాడ్ సిమెంటు పరిశ్రమలు ఉన్న తంగెడ, పెదగార్లపాడు గ్రామాలలో పొలాలు ఉన్న రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తుల తరపున జానీ భాషా, సి.వి.రావులు లేవనెత్తిన పలు అంశాలపై సంబంధిత శాఖలతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, క్షేత్రస్థాయిలో కమిటీ పర్యటించి పది రోజులలో నివేదికను అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంపెనీల యాజమాన్యాలు అధికారులకు సహకరించాలని చెప్పారు. మెడికల్ క్యాంపులను నిర్వహించాలని, ఆయా ప్రాంతాలలో పండించే పంటలపై అధ్యయనం చేయాలని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుడూ లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. గ్రామస్థులలో నమ్మకం ఏర్పడేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, రెవెన్యూ అధికారి మురళి, గురజాల ఆర్డీవో మురళి, జిల్లా పరిశ్రమల అధికారి రవీంద్ర, పొల్యూషన్ కంట్రోల్ అధికారి నజీన బేగం, డీపీవో భాస్కరరెడ్డి, హార్టీకల్చర్ అధికారి రమణారెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

● బాలిక కుటుంబసభ్యుల దాడిలో నిందితుడికి తీవ్రగాయాలు

● అపస్మారక స్థితిలో నిందితుడు.. జీజీహెచ్‌లో చికిత్స

వట్టిచెరుకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు పంచాయతీ పరిధి లోని బాలికపై అత్యాచారం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బాలిక కుటుంబసభ్యులు నిందితుడి గా భావిస్తున్న వ్యక్తిపై దాడి చేయగా తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. నిందితుడైన అదేకాలనీకి చెందిన థామస్ (55) బాలికపై అత్యాచారం చేశాడని సోమవారం సాయంత్రం 7గంటల సమ యంలో వట్టిచెరుకూరు పోలీసులకు బాలిక కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బాలికపై అత్యాచారం, నిందితుడిపై దాడి ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు ఇతర సిబ్బంది అప్రమత్తమై నిందితుడు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ధ్రువీకరించుకున్నారు. ఈనెల 14వ తేదీన ఎవ్వరూ లేని సమయంలో ఇంటి పక్కనే ఉన్న థామస్ అనే 55 సంవత్సరాల వ్యక్తి బాలికపై అత్యాచారం చేశాడు. రెండు రోజులుగా బాలిక అనారోగ్యంతో ఉండటాన్ని కుటుంబసభ్యులు గమనించి ఆ బాలికను అడగ్గా జరిగిన సంఘటనను వివరించింది. దీంతో బాలిక కుటుంబసభ్యులు థామస్‌పై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. అతడి కుటుంబసభ్యులు వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన తరువాత బాలిక కుటుంబసభ్యులు అతడిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఈ కేసును దిశ డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతున్నట్టు వట్టిచెరుకూరు పోలీసులు వెల్లడించారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో నిందితుడి పై దాడికి పాల్పడిన బాలిక కుటుంబసభ్యులపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడైన థామస్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

22న చలపతి 30ఏళ్ల మహోత్సవం

తాడికొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ 30 ఏళ్ల మహోత్సవం ఈనెల 22వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మోతడక ఇంజనీరింగ్ కళాశాలలో చలపతి మహోత్సవం పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 19, 20, 21, 22 తేదీల్లో సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న జరిగే చలపతి మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమారియా, ఏపీ మాజీ డీజీపీ ఎం మాలకొండయ్య, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల కార్యదర్శి వై సుజిత్‌కుమార్, డైరెక్టర్స్ డీ వినయ్‌కుమార్, కే శ్రీనివాసరెడ్డి, జీ సుబ్బారావు, ప్రిన్సిపాల్స్ నాగ శ్రీనివాసరావు, ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చలపతి మహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు, కళాశాలల అధ్యాపకులు

ఏఎన్‌యూ దూరవిద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2025 విద్యాసంవత్సరానికి సెమిస్టర్ విధానంలో వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 31వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. న్యూఢిల్లీ, యూనివర్సిటీ గ్రాంట్ కమి షన్, డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) అనుమతి కలిగి యూజీ, పీజీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పీజీ ఆర్ట్స్ 11 కోర్సులు, యూజీ ఆర్ట్స్ 9 కోర్సులు, పీజీ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ 3 కోర్సులు, యూజీ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ 3 కోర్సులు, లైబ్రరీ ప్రోగ్రామ్స్ 2 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలను ఏఎన్‌యూ దూర విద్య కేంద్రం (www.anucde.info) అధికారిక వెబ్‌సైట్ నుంచి, ఫోన్ నంబర్స్ 98484 77441, 0863-2346323లో సంప్రదించవచ్చని వెంకటేశ్వర్లు తెలిపారు.

గాజుల్లంక ఇసుక రీచ్‌లో మైనింగ్ అధికారుల తనిఖీలు

కొల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గాజుల్లంక ఇసుక రీచ్‌ను మైనింగ్ అధికారులు పరిశీలించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఆగని ఇసుక దందా' శీర్షికపై స్పందించిన బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఇసుక రీచ్‌లను పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు ఫణికుమార్ తన సిబ్బందితో కొల్లూరు మండలంలోని గాజుల్లంక ఇసుక రీచ్‌లో జరిగిన తవ్వకాలను పరిశీలించారు. పరిశీలన నిమిత్తం అధికారులు గోప్యత పాటించారు. ఒక యంత్రాన్ని సీజ్ చేసి సంబంధిత వివరాలను అందించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఇచ్చారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను జిల్లా స్థాయి ఇసుక కమిటీకి నివేదిక అందించి వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.



ఇసుక రీచ్‌లో జరిగిన తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 18(ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి షేక్ మహబూబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 5,6,7,8, తరగతులతోపాటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 25లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఏ బాలశ్రీ(8712625039), నంది వెలుగు రోడ్డులోని మైనార్టీ బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ జయప్రకాశ్ (8712625038), మైనార్టీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పీ సాంబశివరావు(9652569140)ను సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఈ సూచించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 518.80 అడుగులు ఉంది. ఇది 147.09 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,462 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

1,33,222 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,28,999 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,222 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,975 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13500
273	10000	13000
341	10500	14500
4884	10000	12000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	--	--

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10500	13800
బంగారం	11000	12500
బ్యాడిగి 355	--	--
సింజెంటా బ్యాడిగి 5531	10000	13500
దేవనూరు డీలక్స్	--	--
ఆర్మూరు	11000	13300
తాలుకాయలు	5000	7500

సబ్సిడీ రుణాలకు అర్జీలు పెట్టుకోండి

మాచవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈబీసీ, బీసీ కులాలకు సంబంధించి సబ్సిడీ రుణాల కోసం అర్జీలు పెట్టుకోవాలని ఎంపీడీవో వెంగళరావు మంగళవారం తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కుట్టుమిషన్‌ల శిక్షణ కోసం కూడా అర్జీలు పెట్టుకోవాలని, దీనికి కూడా ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చున్నారు. కుల, ఆదాయం ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు ఉండాలన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

వెల్దుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సచివాలయాల్లో బుధవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈనెల 19వ తేదీన వెల్దుర్తి, శిరిగిరిపాడు - 1, 20న ఉప్పలపాడు, శిరిగిరిపాడు - 1, 21, 22న పట్లవీడు, గంగలకుంట, 25న శ్రీరాంపురంతండా, గొట్టిపాళ్ల, 26న రచ్చమలపాడు, మిట్టమీదపల్లె, 27న బోదిలవీడు, కొత్తపుల్లారెడ్డిగూడెం, 28న గుండ్లపాడు, కండ్లకుంట గ్రామ సచివాలయాల్లో క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో ప్రసాద్ అన్నారు.

● **మాచర్ల రూరల్ (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని సెరిన్‌కాలనీ, వడ్డెరబస్తీ, బ్యాంకు కాల నీ (అంగన్‌వాడీసెంటర్) సచివాలయాల పరిధిలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ము న్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు.

● **పిడుగురాళ్ల (ఆంధ్రజ్యోతి):** పురపాలక సంఘం పరిధిలో చెరువుకట్ట బజార్ సచివాలయం, గాంధీనగర్ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రజలు సంబంధిత ఆధార్ కేంద్రాల్లో సేవలను ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ సూచించారు.

● **రాజుపాలెం, (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 19వ తేదీన కోట నెమలిపురి, చౌటపాపాయపాలెం, ఇనిమెట్ల, 20న రెడ్డిగూడెం, రాజుపాలెం, చల్లాపల్లితండా స్కూల్, 21న మొక్కపాడు, బ్రాహ్మణపల్లి, బలిజేపల్లి, 22న ఆకులగణపవరం, అంచులవారిపాలెం, అనుపాలెం, 25న రెడ్డిగూడెం, కొత్తబోధనం, ఇనిమెట్ల 26న మొక్కపాడు, రాజుపాలెం, ఉప్పలపాడు 27న ఆకులగణపవరం, అంచులవారిపాలెం, బలి జేపల్లి, 28న బీరవల్లిపాయ, దేవరంపాడు, అనుపాలెం గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యానారాయణ చెప్పారు.

ఏపీపీగా వీరభద్రుడు తొలగింపు

పిడుగురాళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గురజాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరిస్తున్న బండి వీరభద్రుడును తొలగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. గత ప్రభుత్వంలో మూడేళ్ల నుంచి పని చేస్తున్న వీరభద్రుడును గత ఏడాది మార్చి నెల నుంచి కొనసాగింపు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు హోంశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీకుమార్ విశ్వజిత్ మంగళవారం జీవో జారీచేశారు.

22న మండల పరిషత్ సమావేశం

పెదకూరపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీన జరగనుందని ఎంపీడీవో రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొనాలని కోరారు.

శ్మశాన వాటికకు దారి ఇవ్వాలి

నకరికల్లు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గుండ్లపల్లిలో ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలకు వెళ్లేందుకు దారి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కే పుల్లారావుకు మంగళవారం గుండ్లపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు తహసీల్దార్‌కు కే పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటికకు వెళ్లేదారిలో ఆక్రమణలకు గురైందని, దీనివల్ల అటు వెళ్లే సమయంలో మార్గం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తహసీల్దార్‌ను కలసి కాలనీవాసులు విన్నవించారు. ఇప్పటికైనా ఆక్రమణలను తొలగించి తమకు దారి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పీ 4 సర్వే పూర్తి : ఎంపీడీవో

రెంటచింతల,మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ప్రతి ఇంటికి అభివృద్ధి.. ప్రతి జీవితానికి ప్రగతి అనే నినాదంతో చేపట్టిన పీ 4 సర్వే మంగళవారంతో పూర్తయినట్లు ఎంపీడీవో కె.సరోజనిదేవి చెప్పారు. మండలంలోని 11 గ్రామాల్లో 14904 గృహాలుండగా 14846 గృహాలను పరిశీలించి క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను సేకరించి కంప్యూటర్లో నిక్షిప్తం చేశారన్నారు. 97 శాతం సర్వే పూర్తయిందన్నారు.

వ్యక్తిపై అత్యాచారయత్నం కేసు

దుర్గి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై దుర్గి పోలీసులు అత్యాచారయత్నం కేసు నమోదు చేశారు. మండలంలోని మించాలపాడుకు చెందిన ఓ వివాహిత తనను అదే గ్రామానికి చెందిన వలపాల చిన అంజి అనే వ్యక్తి కొద్ది రోజులుగా తరచూ వేధిస్తున్నాడని, గత సోమవారం ముటుకూరు గ్రామంలో మిరపకోతలకు వెళ్లగా చిన అంజి తన పై అత్యాచారయత్నం చేశాడని మంగళవారం దుర్గి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

మద్యం షాపును ఏర్పాటు చేయొద్దు

పిడుగురాళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జానపాడు రోడ్డులో షిరిడీ సాయిమందిర్, కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం సమీపాలలో కొత్త మద్యం షాపు పెట్టవద్దని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు. దేవాలయాల సమీపంలో మద్యం షాపులను ఏర్పాటు చేయడం ద్వారా భక్తుల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా కొన్ని రకాల ఇబ్బందులు కూడా తలెత్తుతాయని ఎక్సైజ్ అధికారులు విషయాన్ని పరిశీలించి జానపాడు రోడ్డులో కొత్త మద్యంషాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ ఇస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళనకు సిద్ధమవుతామన్నారు.

పిల్లేరు వాగుపై నిర్మాణం జరిగేనా?

- వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది
- వాగు ఉధృతికి మనుషులు, పశువులు గల్లంతు
- హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని తండావాసుల వేడుకోలు

మాచవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేశ్వరపురం తండా గ్రామ సమీపంలో ఉన్న పిల్లేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ఈ ప్రభుత్వంలోనైనా నిర్మాణం జరిగేనా? అని పరిసర గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. వర్షాకాలంలో పిల్లేరు వాగు ఉధృతికి రాకపోకలు స్తంభించి పోతాయి. లోలెవల్ చప్టా కావటంతో పిల్లేరు వాగు ఉధృతి చప్టాపై మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో ప్రవహిస్తుంది. వాగు ఉధృతికి ఒక వ్యక్తి చనిపోయిన విషయం పాఠకులకు విదితమే. ఇటీవల డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన బాలునాయక్ సోదరుడు ఈ వాగు ఉధృతికి కొట్టుకొని పోయి మృతి చెందిన విషయం తెలిసిందే. అంతేగాకుండా పశువులు, జీవాలు, వాహనాలు వాగు ఉధృతికి కొట్టుకు పోయిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. లోలెవల్ చప్టా కావటంతో చిన్నపాటి వర్షానికి కూడా నీరు చప్టాపై ప్రవహించటంతో చప్టాపై పాచి పట్టి ఉండటంతో ప్రజలు నడిచిపోతుంటే జారిపడి నీటి ప్రవాహానానికి కొట్టుకొని పోతుంటారు. అంతేగాకుండా కొంత మంది వాగు ప్రవహిస్తున్న సమయంలో అక్రమ సంపాదన కోసం లోలెవల్ చప్టాకు ఉన్న గెనెల్లోకి నీరు వెళ్లకుండా చప్టాపై ప్రవహించే విధంగా గనెలకు



నాగేశ్వరపురం తండా వద్ద లో లెవల్ చప్టా

వరిగడ్డి తదితర వస్తువులు అడ్డం పెడతారు. స్థానికులు కాకుండా వేరే ప్రాంతాల నుంచి వచ్చిన ద్విచక్ర వాహనదారులను వాగు దాటించేందుకు స్థానికులు వారి నుంచి డబ్బులు వసూలు చేస్తుంటారు. దీంతో చప్టాపై నీరు ఎల్లప్పుడు ప్రవహించటం వల్ల పాచి పట్టి జారేందుకు అవకాశం ఉంది. ఆ చప్టాపై మాచవరం మండలం, పిడుగురాళ్ల మండలాలకు చెందిన ప్రజలు రాజధాని అమరావతికి వెళ్లాలంటే కిలో మీటర్ల మేర దూరం తగ్గుతుంది. ఈ చప్టాపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి

- పుల్లిబిల్లి రాధాకృష్ణ



పిల్లేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టి పలు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలి. వర్షాకాలంలో వాగు ఉధృతికి రాకపోకలు స్తంభించి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యను గుర్తించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరం

- బత్తుల కృష్ణ



పిల్లేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరం. దీనివల్ల పల్నాడు ప్రాంతంలోని అనేక గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. బ్రిడ్జి నిర్మాణం చేపడితే మాచవరం, పిడుగురాళ్ళ మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలు రాజధాని అమరావతి వెళ్లేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అంగన్‌వాడీల పని తీరు అధ్వానం

మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా పీడీ ఉమాదేవి

సత్తెనపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం తాను తనిఖీ చేయగా మూడు కేంద్రాల పరిస్థితి అధ్వానంగా ఉందని మహిళా శిశు సంక్షేమ శాఖ పల్నాడు జిల్లా పీడీ ఉమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె పట్టణంలోని 22, 25, 27 వార్డుల పరిధి లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు కేంద్రాల్లో ప్రీ స్కూల్ చిన్నారులకు మెను ప్రకారం భోజనం పెట్టలేదన్నారు. మంచి నీరు కూడా లేవన్నారు. ఒక అంగన్‌వాడీ కేంద్రంలో 34కేజీల బియ్యం, 34 లీటర్ల పాలు, మూడు కేజీల కంది పప్పు అదనంగా ఉందన్నారు. ఆ కేంద్రంలో రికార్డులు కూడా అందుబాటులో లేకపోవటంతో రిమార్కులు అటెండెన్స్ రిజిస్టర్‌లో రాసినట్టు ఆమె తెలిపారు. మరో కేంద్రంలో కూడా రికార్డులు అందుబాటులో లేవన్నారు. స్టాక్ వివరాలు నమోదు చేసుకొని వచ్చామన్నారు. మూడు కేంద్రాలపై స్థానిక సూపర్‌వైజర్, సీడీపీవో, ఏసీడీపీవోల పర్యవేక్షణ లోపం ఉందన్నారు. కేంద్రాల నిర్వాహణ సక్రమంగా లేకపోవటంపై ముగ్గురు అధికారులను వివరణ కోరతామని ఆమె తెలిపారు. కేంద్రాల దుస్థితిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు కూడా ఆమె వివరించారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి

● ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి

క్రోసూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి అన్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన 16 మందికి ఆమె అధికారులతో కలసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తమ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేయటం, తరుచుగా జాబ్ మేళాలు నిర్వహించటం, ఉపాధి కల్పనకు సంబంధించి వివిధ కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఇక్కడ జరిగిన జాబ్ మేళాకు 26 మంది హాజరు కాగా మూడు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 16



ఉద్యోగాలు పొందిన వారితో కళాశాల ప్రిన్సిపాల్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

మంది ఉద్యోగాల కోసం ఎంపికైనట్టు తెలిపారు. ఇక్కడ జరిగిన జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారు దీనిని మొదటి విజయంగా భావించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకొనేందుకు కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం రవీంద్రనాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ బీ అంజిరెడ్డి, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగాలు పొందిన వారిని కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

రైతులకు తొమ్మిది గంటలు విద్యుత్‌ను అందించాలి

● పల్నాడు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్

దాచేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు తొమ్మిది గంటల విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని పల్నాడు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ పత్తిపాటి విజయకుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం దాచేపల్లి మండలంలోని తంగెడ, పెదగార్లపాడు, నడికూడి గ్రామాల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లను పర్యవేక్షించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. విద్యుత్ వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తొలగించాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. కరెంటు బిల్లు వసూళ్లల్లో సిబ్బంది



నడికూడి సబ్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఈతో పాటు మాచర్ల ఈఈ నూతలపాటి సింగయ్య, డీఈఈ టీ వీరేశ్వరరావు, ఏఈలు భగవాన్‌నాయక్, దండా నాగేశ్వరరావు తదితరులున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గురజాలటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వాగ్దేవీ ఫార్మసీ కళాశాల వద్ద డ్రగ్స్ వద్దు బ్రో అనే ఫ్లకార్డులను చేతబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ అందరూ కలిసి మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌కుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ముప్పాళ్లలో డ్రగ్స్ వద్దుబ్రో గోడపత్రికలను ప్రదర్శిస్తున్న ఎస్ఐ సోమేశ్వరరావు, అధికారులు

● **ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి):** మత్తు పదార్థాలు, డ్రగ్స్ వాడటం వల్ల యువకుల జీవితాలు నాశనమవుతాయని యువత వాటికి దూరంగా ఉండాలని ఎస్ఐ సోమేశ్వరరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద డ్రగ్స్ వద్దుబ్రో గోడపత్రికలను పోలీసు సిబ్బంది పలువురు అధికారులు, ప్రజల సమక్షంలో మంగళవారం ఆవిష్కరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద గోడ పత్రికలను అతికించడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైటర్ నవరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● **అమరావతి (ఆంధ్రజ్యోతి):** అమరావతిలో సీఐ అచ్చయ్య ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో.. కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విజయవాడ రోడ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీసుశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిఐ అచ్చయ్య తెలిపారు.

విద్యుత్ భారాలను తగ్గించాలి : సీపీఎం నాయకులు

సత్తెనపల్లి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోజు రోజుకు ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతుందని ఆరోపించారు. విద్యుత్ చార్జీల తగ్గింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలన్నారు. ప్రజలపై భారాలు మోపటం మాని ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ చక్రవర్తికి అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీ విమల, గద్దె చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై కగార్ యుద్ధాన్ని నిలిపివేయాలి

దాచేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలపై మోదీ, అమిత్‌షా ప్రభుత్వం చేస్తున్న కగార్ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదికలో డిమాండ్ చేశారు. మంగళవారం దాచేపల్లి మండల పెన్షన్ హాల్లో చర్చా గోష్టి నిర్వహించారు. తెలనాకుల సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ హితులైన ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న యుద్ధాన్ని ఆపాలన్నారు. కార్పోరేట్ కంపెనీలకు అడవిలో ఉన్న అరుదైన ఖనిజ సంపదను దోచిపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న ఆదివాసీలను అడవి నుంచి తరిమి వేసే సామూహిక హత్యాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. చర్చా గోష్టిలో సీ కోదండరామిరెడ్డి, బుర్రి కృష్ణారెడ్డి, తమ్మిశెట్టి వెంకటనరసయ్య, కోలా నవజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నామినేషన్‌లు

సత్తెనపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికి జరగాల్సిన ఎన్నికలకు సంబంధించి అధ్యక్ష పదవికి చిలుకా చంద్రశేఖర్, గంగూరి అజయ్‌కుమార్, ఉపాధ్యక్ష పదవికి చిన్న మణిబాబు, సర్వేపల్లి సీతారామాంజనేయులు, కార్యదర్శి పదవికి బయ్యవరపు నరసింహారావు, పీ హరిమణికంట, సబ్ కోర్టు కార్యదర్శి పదవికి షేక్ జానీ ఖాజావలి, జొన్నలగడ్డ విజయకుమార్, సహాయ కార్యదర్శి పదవికి గుజ్జర్లపూడి సురేష్‌బాబు, కోశాధికారి పదవికి బుర్రి సైదయ్య, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి తవ్వ హరిబాబు, సీనియర్ ఎగ్జిక్యూటీవ్ పదవికి నిమ్మకాయల నాగులు, లైబ్రియన్ పదవికి ఉల్లం మధుబాబు, లేడీ రిప్రజెంటీవ్ పదవికి మహంకాళి కోటేశ్వరమ్మ నామినేషన్‌లు దాఖలు చేసినట్టు ప్రధాన ఎన్నికల అధికారి జీ మార్కురావు, సహాయ ఎన్నికల అధికారి ఎన్ ఆంజనేయులు మంగళవారం విలేకరులకు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి : తహసీల్దార్ నగేష్

గురజాలటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కలిగిన కార్డుదారులు, కార్డులోని కుటుంబసభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ నగేష్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఈకేవైసీ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్డుదారులు, కుటుంబసభ్యుల ఈకేవైసీని నమోదు చేశారు. మండలపరిధిలో ఈకేవైసీ నమోదు కానీ వారు 6884 మంది ఉన్నారని, ఈ జాబితాను చౌక ధరల దుకాణం డీలర్లకు, వీఆర్వోలకు అప్పగించామని చెప్పారు. ఈకేవైసీ నమోదు చేసుకోని వారు సంబంధిత డీలరు, వీఆర్వో వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బేస్‌బాల్ రాష్ట్ర జట్టుకు నలుగురి ఎంపిక

క్రోసూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగే సబ్ జూనియర్ బేస్‌బాల్ రాష్ట్ర జట్టుకు క్రోసూరుకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. అమెచ్యూర్ బేస్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు పంజాబ్‌లోని సంగూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారు. బాలుర జట్టుకు కే జాషువా డేనియల్, ఎస్‌కే అబూబకర్ ఎంపిక కాగా బాలికల జట్టుకు వీ గ్రీష్మబిందు, ఎం గాయత్రి ఎంపికయ్యారు. వీరంతా క్రోసూరులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్లో చదువుతున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత తెలియజేశారు.

చెంచులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులతో చెంచులు

దుర్గి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రాజానగర్, నిదానంపాడు, మల్లికార్జున గూడెం, అడిగొప్పుల, కాకిరాల, ముటుకూరు, తేరాల గ్రామాల్లోని చెంచులకు మంగళవారం శ్రీశైలం ఐటీడీఏ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులను అందించారు. ప్రస్తుతం 325 కుటుంబాలకు 9 రకాల నిత్యావసర సరుకులు అందించినట్లు సీసీ శంకర్ తెలిపారు. తేరాల, కాకిరాల, రాజానగర్ గ్రామాల్లో చెంచులకు పక్కా గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది, చెంచులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్ల పంపిణీ

ముప్పాళ్ళ మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు అందుబాటులో ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు మంగళవారం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు డాక్టర్ జయకృష్ణ మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు ఏమైనా వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేయవలసిన ప్రాథమిక చికిత్సను వివరించారు. అన్ని గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. కూలీలు ఉపాధి హామీ పనిచేసే ప్రతిచోట ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో ఏడుకొండలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

రాజుపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించి ఓబీఎంఎంఎస్ లోన్లు ఇవ్వనున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యానారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రుణాలు పొందుటకు అర్హులైన వెనకబడిన తరగతులవారు, ఆర్థికంగా వెనుకబడిన వారు కమ్మ, రెడ్డి, కాపు, బలిజ, బంటరి, వైశ్య, తెలగ కులాల వారు ఈ నెల 22వ తేదీ లోపు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21 నుంచి 50 సంవత్సరాలలోపు ఉండాలని చెప్పారు.

ద్వారకా తిరుమలరావును కలిసిన కన్నా

సత్తెనపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును మంగళవారం విజయవాడలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చలు సాగినట్టు సమాచారం. సత్తెనపల్లి నియోజకవర్గంలోని పలు రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని కన్నా కోరారు.



ద్వారకా తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా

శాప్ క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ లెజిస్ట్రేటర్స్ స్పోర్ట్స్ మీట్ 2025 విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పోరేషన్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌ఏపీ) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మంగళవారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, ఉరుకుల పరుగుల రోజువారీ జీవితంలో ఒత్తిడి తగ్గించేందుకు, అందరూ స్నేహభావంతో కలిసి మెలిసి ఉండడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.



క్రీడా పోటీల వద్ద ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

తిరునాళ్ల విజయవంతం మనందరి బాధ్యత

● తహసీల్దార్ ఫణీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దుర్గి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24వ తేదీన జరగనున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల విజయవంతం చేయడం మనందరి బాధ్యత అని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అడిగొప్పుల శివారులో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరునాళ్ల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. లక్షలాది మంది అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారని, అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఎస్ఐ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఎస్పీ శ్రీనివాసరావు తిరునాళ్ల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని, తిరునాళ్లకు 300 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈవో సైదమ్మబాయి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ఏచూరి సునీతా శంకర్, ఎంపీడీవో శివకుమార్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, సర్పంచ్ జక్కా రమేష్ పాల్గొన్నారు.

పీఆర్కేకు రెంటచింతలలో ప్రవేశ అనుమతి నిరాకరణ

రెంటచింతల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో 15 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెంటచింతలలో ప్రవేశానికి మంగళవారం మరోసారి పోలీసులు అనుమతి నిరాకరించారు. వైసీపీకి చెందిన శివతేజ రోడ్డు ప్రమాదంలో పిడుగురాళ్లలో మృతి చెందగా, మృతదేహానికి మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మేదరమెట్ల నుంచి పీఆర్కే వస్తుండగా రెంటచింతల సమీపంలోకి రాగానే జాతీయ రహదారి మీదుగా వెళ్లాల్సిందిగా పోలీసులు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయానికి 'నిమ్మల' సాయం



నిమ్మల శేషయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుంటూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, అమరావతి మండలం, మండేపూడి గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం అభివృద్ధి నిమిత్తం టీడీపీ నాయకుడు, ప్రజావైద్యశాల చైర్మన్ డాక్టర్ నిమ్మల శేషయ్య ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శేషయ్యను స్వామి వారి వస్త్రాలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పమిడిపూల అనిల్‌కుమార్, ముక్కంటి ఉమామహేశ్వరరావు, ఇందూరి కిషోర్, సాంబయ్య, పువ్వాడ అశోక్, శరభలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణం కోసం సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను నిర్మూలించేందుకు, ప్లాస్టిక్ రహిత పట్టణం కోసం సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు వ్యాపారులను కోరారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల్లో సిబ్బందితో కలిసి దాడులు జరిపారు. ఈ దాడుల్లో సుమారు 45 కేజీల ప్లాస్టిక్, పాలిథిన్ (లగేజీ కవర్లు)ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, డీఈ సుభాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు సంఖ్య కోసం దరఖాస్తు చేసుకోవాలి

ముప్పాళ్ళ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ రైతు గుర్తింపు సంఖ్య కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో అరుణ అన్నారు. మండలంలోని చాగంటివారి పాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరిగింది. రైతు గుర్తింపు సంఖ్య కోసం ఆధార్, పొలం సర్వే నంబర్, ఫోన్ నంబర్ కావాలన్నారు. మిర్చి సాగు చేసే రైతులు ఈనెల 31 వరకు సాగునీరు విడుదలవుతుందని రైతులు తమ పంటలను తడుపుకోవాలన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరుడి కల్యాణం

రెంటచింతల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని సుబ్బన్నతోటలో ఉన్న శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరుని స్వామి కల్యాణంతో పాటు ఆలయ 21వ వార్షిక వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ చైర్మన్ నాళం పెదబాబు చెప్పారు. స్వామి వారి లడ్డూను గానుగపంట శ్రీనివాసరెడ్డి రూ.20 వేలకు పాడుకున్నారు. పూజారులు జిగురు చంద్రశేఖర శర్మ,మారుతి శర్మల నేతృత్వంలో సాయంత్రం వేళ స్వామి వార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



శ్రీఅలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి

ఎస్సీ వర్గీకరణపై టీడీపీ నాయకుల హర్షం

క్రోసూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు మంత్రి వర్గం ఆమోదం తెలపటంతో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యాయులు దుద్దుల యోహాన్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ సెల్ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణకు ఆమోదం లభించటం మాదిగలకు, ఉప కులాలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. వర్గీకరణలోని ప్రధాన అంశాలైన ఒకటో క్యాటగిరిలో రెల్లి ఉప కులాలకు ఒక్క శాతం, రెండో క్యాటగిరిలో మాదిగ ఉపకులాలకు 6.5 శాతం, మూడో క్యాటగిరిలో మాల ఉప కులాలకు 7.5 శాతం రిజర్వేషన్‌లకు ఆమోదం తెలపటం శుభ పరిణామమన్నారు.

రైళ్ల సమయపాలనలో నెం 10

- దేశంలోనే గుంటూరు రైల్వే డివిజన్‌కు అరుదైన ఘనత
- ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేసి అభినందించిన కేంద్ర రైల్వే మంత్రి
- దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో టాప్ పొజిషన్

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైళ్ల సమయపాలన విషయంలో గుంటూరు రైల్వే డివిజన్ జాతీయ స్థాయిలోనే గుర్తింపు పొందింది. దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్న డివిజన్లలో 10వ స్థానంలో నిలిచి దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు గర్వకారణంగా నిలిచింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా మంగళవారం తన ట్విట్టర్(ఎక్స్) ఖాతాలో అభినందిస్తూ పోస్టు చేశారు. కాగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఉన్న అన్ని డివిజన్లలో కంటే గుంటూరు అగ్రస్థానంలో నిలవడం మరో విశేషం. దీంతో డివిజన్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌లో నిత్యం రెగ్యులర్/స్పెషల్ ట్రైన్స్ కలుపుకొని దాదాపుగా 200 వరకు ప్రయాణిస్తున్నాయి. వీటిల్లో కొన్ని ఇక్కడి నుంచి ప్రయాణం ప్రారంభమయ్యేవి ఉండగా, చాలావరకు ఇతర డివిజన్ల నుంచి వచ్చి వెళుతుంటాయి. గుంటూరు - విజయవాడ, గుంటూరు - తెనాలి మధ్యన డబుల్ ట్రాక్ ఉన్నది. అలానే గుంటూరు నుంచి దిగువమెట్ట వరకు కూడా డబుల్ ట్రాక్ సదుపాయం ఉన్నది. సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు ప్రస్తుతానికి సింగిల్ ట్రాక్ మాత్రమే అందుబాటులో ఉన్నది. దీని వలన కొన్ని రైళ్లను లూప్‌లైన్‌లో పెట్టాల్సిన పరిస్థితి. అలానే గూడ్స్ రైళ్ల ద్వారా ఆదాయం సమకూరుతుంది. దీంతో వాటిని కూడా నిర్ణీత సమయానికి నడపాల్సి ఉన్నది. అయినప్పటికీ 95.7 శాతం సమయపాలన సాధించడం విశేషం.

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో గుంటూరుతో పాటు విజయవాడ, గుంతకల్లు, నాందేడ్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లు ఉన్నాయి. అయినప్పటికీ సమయపాలన విషయంలో అన్నింటిని వెనక్కు నెట్టి గుంటూరు అగ్రస్థానంలో నిలవడంపై అంతా ఆశ్చర్యపోతున్నారు. జోన్‌లో గుంటూరు తర్వాత గుంతకల్లు(94.3), హైదరాబాద్(93.6 శాతం), నాందేడ్(92.5) సమయపాలన సాధించాయి.



గుంటూరు రైల్వే స్టేషన్

23న ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్ష

పెదకాకాని, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల చేసినట్టు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంక



టేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయని అభ్యర్థులు నేరుగా పదో తరగతి, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా, ఫొటోతో పాటు సాధారణ ఫీజు రూ.500 చెల్లించి, పరీక్షకు నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 25వ తేదీ సాయంత్రం విడుదల చేస్తామని చెప్పారు. కాగా.. ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఈ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చు.

నల్లపాడు జీడీసీసీ అధికారుల సస్పెన్షన్ ?

◆ చర్యలకు సిద్ధమయిన అధికారులు

◆ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించడంతో కదలిక

గుంటూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు జీడీసీసీ బ్యాంకును అక్రమాలకు అడ్డాగా మార్చిన అధికారులను సస్పెండ్ చేసేందుకు రంగం సిద్ధమైంది. జీడీసీసీ బ్యాంకు కు చెందిన మేనేజర్లు, సూపర్వైజర్లు,నోడల్ అధికారులపై వేటు పడనున్నట్లు తెలుస్తుంది.నల్లపాడు జీడీసీసీ బ్యాంకు లో రూ.5 కోట్ల అక్రమాలు జరిగిన విషయాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజనేయులు సోమవారం అసెంబ్లీ లో ప్రస్తావించారు. నకిలీ రుణాలు పొందేందుకు సహకరించిన వారిపై ఏ విధమైన చర్యలు తీసుకోలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. దానిపై స్పందించిన ప్రభుత్వం జీడీసీసీ అధికారులపై వేటు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక మహిళా అధికారిని కూడా సస్పెండ్ చేయనున్నట్లు సమాచారం అందింది.

సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట - రావికంపాడు మధ్యన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించి నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి, 24, 25 తేదీల్లో విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి, 24న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రెండు వైపులా రద్దు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అలుమ్నికి.. ఆటంకాలు

(5వ పేజీ తరువాయి)

మూటగట్టుకుంటోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కళాశాల పూర్వ విద్యార్థుల విజయగాథలను ఐదు సంకలనాలుగా పుస్తకాల రూపంలో తీసుకొస్తే వాటిని భావితరాలకు అందించడంలోనూ వర్సిటీ నిర్లక్ష్యంపై అలుమ్ని తప్పుబడుతోంది.

పరిగణనలోకి తీసుకోని వర్సిటీ

ఏజీ కళాశాలలో వసతి గృహాల పరిస్థితి దారుణంగా ఉంది. పోతన వసతి గృహం మూతపడగా, వేమన, సిద్ధార్థ హాస్టల్ భవనాలు పెచ్చులూడుతూ విద్యార్థులను భయపెడుతున్నాయి. ఆ ఫొటోలను ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ఖాతాకు ట్యాగ్ చేసిన పూర్వ విద్యార్థులు తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనాల నిర్మాణానికి వర్సిటీ నుంచి నిధుల మంజూరు అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పూర్వ విద్యార్థుల్లో కొందరు నిధులు ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే వారిని యూనివర్సిటీ పెద్దలు అసలు పరిగణనలోకి తీసుకోవడంలేదని సమాచారం. సేద్యంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు తగ్గట్లు బోధనా పద్ధతులలో కూడా మార్పు రావాల్సి ఉంది. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు మొదలుకుని ల్యాబ్స్ వరకు అన్ని వర్సిటీనే భరించాలంటే నిధుల కొరత ప్రతిబంధకంగా ఉంది. ఈ పరిస్థితుల్లో నిధులు ఇవ్వడానికి ముందుకొచ్చే పూర్వ విద్యార్థులకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా యూనివర్సిటీ ఆలోచన చేయాల్సి ఉంది. వర్సిటీ పెద్దలు చొరవ తీసుకుని అలుమ్నితో సమావేశమై వారి వైపు నుంచి అందాల్సిన సహకారంపై స్పష్టత ఇవ్వగలిగితే భారీ విరాళాలు వచ్చే అవకాశం ఉంది.

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతమున్న సర్వీసులు, భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఉచిత ప్రయాణం నేపథ్యంలో అందుకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలపై ఆర్టీసీ యంత్రాంగం ఫోకస్ పెట్టింది.


గుంటూరులోని ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్

ఉచిత ప్రయాణంపై.. కసరత్తు

- జిల్లా వ్యాప్తంగా లెక్కలు తీస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
- అదనపు బస్సుల అవసరంపై ప్రణాళికలు
- ఓఆర్ మరింత పెరిగే ఛాన్స్

గుంటూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్టాండ్‌లలో సదుపాయాలు, సర్వీసులు, రద్దీ రూట్‌లలో ప్రయాణాలు వంటి అంశాలపై ఆర్టీసీ కేంద్ర కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. దాంతో అధికారులు అదనపు సౌకర్యాలు, సర్వీసులపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అద్దెవి కలుపుకొని ఆర్టీసీకి వెయ్యి వరకు సర్వీసులున్నాయి. విభజిత గుంటూరు జిల్లాలో గుంటూరు -1,2 డిపోలతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలున్నాయి. అలానే పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల డిపోలుండగా, బాపట్ల జిల్లాలో బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి డిపోలున్నాయి. అయితే మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల వివరాలు తీస్తున్నారు.

ఓఆర్ మరింత పెరిగే ఛాన్స్

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) మరింత పెరగనున్నట్లు అంచనాలు వేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓఆర్ 70 శాతం వరకు ఉంటుందని సమాచారం. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి తీసుకొస్తే ఈ రేషియో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సంఖ్య మరిన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మహిళల రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన అదనపు సర్వీసులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ (ఈడీ) నాగేంద్రప్రసాద్‌తో పాటు జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) ఎమ్ రవికాంత్‌లు ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

పీఎం యోగ అవార్డులు-2025

- దరఖాస్తు ప్రక్రియ షురూ
- నెలాఖరు వరకే ఛాన్స్
- నాలుగు కేటగిరీల్లో అవార్డులు

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 2025 ప్రధానమంత్రి యోగా అవార్డుల కోసం కేంద్ర ఆయుష్ శాఖ దరఖాస్తుల స్వీకార ప్రక్రియని ప్రారంభించింది. యోగాని అభివృద్ధి, ప్రమోట్ చేస్తూ సమాజంపై కీలకంగా ప్రభావం చూపుతున్న వ్యక్తులు/సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేయనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ అవార్డులను ప్రకటిస్తుంది. జాతీయ వ్యక్తిగత, అంతర్జాతీయ వ్యక్తిగత, జాతీయ సంస్థ, అంతర్జాతీయ సంస్థ కేటిగిరీల్లో నాలుగు అవార్డులు ఇస్తుంది. ఒక్కో అవార్డుకు నగదు బహుమానాన్ని రూ. 25 లక్షలుగా నిర్ణయించడంతో ఏటా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కూడా యోగా గురువులు, సంస్థలు దరఖాస్తు చేసు కుంటున్నాయి. ఈ నెల 31వ తేదీతో దరఖాస్తు చేసుకో వడానికి గడువు ముగియనున్నందున ఉమ్మడి గుంటూరు జిల్లా స్టెప్ సీఈవో ఆర్ చంద్రముని సూచించారు.

వ్యాధి నిరోధకత, ఆరోగ్యోన్నతి, జీవనశైలి రుగ్మతలకు అడ్డుకట్ట వేసే గొప్ప సాధనంగా యోగాకు పేరున్నది. 2014 డిసెంబరు 11వ తేదీన వచ్చిన అంతర్జాతీయ విజ్ఞప్తి మేరకు యూఎన్ జనరల్ అసెంబ్లీ ఏటా జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగ దినోత్సవంగా జరుపుకునేలా తీర్మానం చేసింది. అది మొదలుకొని ఏటా ఇక్కడ నిర్ణీత తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతున్నారు. యోగ సాధకులే కాకుండా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఎన్‌సీసీ క్యాడెట్‌లు భాగస్వామ్యం అవుతూ మరింత ప్రాముఖ్యాన్ని తీసుకొస్తున్నారు. కాగా యోగాని మరింతగా ప్రమోట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా నాలుగు కేటగిరీల్లో అవార్డులను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నది. 40 సంవత్సరాల వయస్సు, యోగా ప్రచారం, అభివృద్ధిలో అద్భుతమైన ట్రాక్ రికార్డు, కనీసం 20 ఏళ్లుగా సేవ చేస్తున్నట్లు అయితే ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

అవార్డుల కోసం ఒక వెబ్‌సైట్‌ని కూడా కేంద్ర ఆయుష్ శాఖ ప్రారంభించింది. ఇన్నోవేటివ్ ఇండియా.మైజీవోవీ.ఐఎన్/పీఎం-యోగా-అవార్డ్-2025/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు అవకాశం కల్పించింది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకార ప్రక్రియ ప్రారంభం కాగా నెలాఖరుతో గడువు ముగిసిపోతుంది. అవార్డులకు ఎంపికైన వాళ్ల, సంస్థల పేర్లను యోగా దినోత్సవం రోజున కేంద్రం ప్రకటిస్తుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అనేక యోగా సంస్థలు ఉన్న దృష్ట్యా వారంతా దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈవో విజ్ఞప్తి చేశారు.



సిద్ధమౌతున్న సీఆర్‌డీఏ భవనం

(5వ పేజీ తరువాయి)

వచ్చేలా భవనాన్ని 2 లక్షల 43వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపొందిస్తున్నారు. ఈ భవనం గ్రౌండు ఫ్లోర్‌లో ఎంట్రన్స్ లాబీతోపాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, కిచెన్, సర్వర్ రూమ్స్, బ్యాంకు, ఏటీఎం తదితరాలను ఏర్పాటు చేస్తున్నారు. వెనుక భాగంలో ఫైర్ సేఫ్టీ భవనం, పవర్‌హౌస్‌ను నిర్మించనున్నారు. మూడు ఫ్లోర్లను సీఆర్‌డీఏ కేటాయించనుండగా తొలి అంతస్తులో ఐదు సెమినార్ హాల్స్, రిసెప్షన్ ఏరియా, రిజిస్ట్రేషన్ చాంబర్, లంచ్ హాలు ఉంటాయి. 240 సీటింగ్ సామర్థ్యంతో ఏవీ సెమినార్ హాలు సౌండ ప్రూఫ్, ఉడెన్ కార్పెట్ ఫ్లోరింగ్ తో నిర్మిస్తున్నారు. సెకండ్ ఫ్లోర్‌లో కార్యాలయ సిబ్బంది క్యాబిన్లు, ఓపెన్ వర్కు స్టేషన్లు, అడిషనల్ కమిషనరు చాంబర్లు, ఐటీ హబ్, ప్రింటర్ చాంబర్లు ఉంటాయి. మూడో అంతస్తులో కమిషనరు చాంబర్, అడ్మినిస్ట్రేషన్ విభాగం, సిబ్బంది ఓపెన్ వర్కు స్టేషన్లు ఉంటాయి. తర్వాతి రెండు ఫ్లోర్లను ఏడీసీ(అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కార్యాలయానికి కేటాయించారు. కార్యాలయాల కోసం వినియోగిస్తారు. ఆరు, ఏడు ఫ్లోర్లను ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు ఇవ్వనున్నారు. ఇక ఈ భవనానికి తూర్పు వైపున మూడు, ఉత్తరం వైపున రెండు, పడమర వైపున రెండు లిఫ్టులను ఏర్పాటు చేయనున్నారు.

పనులతో మళ్లీ కళకళ

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా అమరావతిపై కక్ష కట్టి ఎక్కడికక్కడ పనులు నిలిపివేసింది. ఈ పరిస్థితుల్లో 2024 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రావడంతో అమరావతిలో మళ్లీ రాజధాని కళ కనిపించడం మొదలైంది. ఈ క్రమంలోనే దాదాపు రూ.40 వేల కోట్లకు పైగా వ్యయంతో పనులను పునఃప్రారంభించేందుకు అధికార యంత్రాంగాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు సన్నద్ధం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చీ రావడంతోనే జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. గతేడాది అక్టోబరు 19న సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవన పనులను పునః ప్రారంభించారు. ప్రస్తుతం దాదాపు సివిల్ పనులు పూర్తి చేశారు. తొలి నాలుగు అంతస్తులలో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. ఇంటీరియర్ వర్కులను కూడా సమాంతరంగా చేపట్టారు. ఇంటీరియర్‌లో ఆర్కిటెక్‌కు ప్రాధాన్యమిస్తున్నారు.


2024 అక్టోబరు 16న పూజచేసి భవన పునఃనిర్మాణ పనులను ఆరంభిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

నిబంధనలు కచ్చితంగా అమలుచేస్తున్నాం

- సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు
- సీఆర్‌డీఏ అధికారులతో సమావేశమైన ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సభ్యులు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు మంజూరు చేసేం దుకు నిర్దేశించిన కార్యక్రమాల అమలు అలాగే ప్రాజెక్టులో భాగంగా తొలి ఏడాది యాక్షన్ ప్లాన్‌పై చర్చల నిమిత్తం ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులు సీఆర్‌డీఏ కార్యాలయంలోని ఆడిటోరియంలో మంగళవారం సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో సమావేశమయ్యారు. సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, మల్లారపు నవీన్‌తో పాటు సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు రాజధాని అమరావతిలో చేపట్టిన పనుల ను గత ఏడాదిలో ఆయా పనులలో సాధించిన పురోగతిని వివరించారు. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులో కీలకమైన అంశాలకు సంబంధించిన డిస్బర్స్ మెంట్, కార్యక్రమం అమలులో పాటి స్తున్న కార్యకలాపాలను అధికారులు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందానికి వివరించారు.


బ్యాంకు అధికారులతో సమావేశమైన సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు

కమిషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ నిధుల మంజూరుకు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ నిర్దేశించిన నిబంధనలను రాజధాని అమరావతి నిర్మాణంలోనూ, ప్రొక్యూర్‌మెంట్, టెండరింగ్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలులో కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన బృంద సభ్యులకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తామన్నారు. అనంతరం అదనపు కమిషనర్ జి.సాయి సూర్య ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు.

ప్రపంచ బ్యాంక్, ఆసియా బ్యాంక్ బృందానికి అమరావతి ప్రాంతంలో అమలవుతున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాల అమలు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేస్తున్న విధానం గురించి సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు వివరించారు. అమరావతి ప్రాంతంలో అమలు చేస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల అమలు, నిర్మాణ కార్యకలాపాలు జరిగే చోట కార్మికుల భద్రతకు అమలు చేస్తున్న కార్యకలాపాలను గురించి ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులకు వివ రించారు. తొలిరోజు జరిగిన సమావేశాలలో రాజధాని అమరావతి నిర్మాణ కార్యకలాపాలపై అధికారులు వివ రించిన వివిధ అంశాలు, కార్యాచరణ, ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, ఫిర్యాదులు పరిష్కరిస్తున్న విధానంపై ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులు పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు.







సుర్రుమంటున్న సూరీడు

వేసవికాలం ప్రారంభం అయ్యింది. మార్చి రెండోవారంలో సూరీడు సుర్రుమంటున్నాడు. రెండు, మూడు రోజుల నుంచి ఎండలు ముదురుతుండగా.. ఉదయం పదిగంటల నుంచే సూర్యుడు తన ప్రభావాన్ని చూపుతున్నాడు. జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఎండ దెబ్బకు, వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించగా.. మహిళలు, పిల్లలు ఇబ్బంది పడుతూ కనిపించారు. ఎండ నుంచి రక్షణ కోసం గొడుగులు.. స్కార్ఫ్‌లు వినియోగించారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం రాజాపేటలో ఉన్న ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ ఎన్.సుబ్రమణ్యం మంగళవారం తెలిపారు. 5వ తరగతిలో 80సీట్లకు, 6, 7, 8 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని కోరారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు స్కూల్లో సంప్రదించవచ్చునని తెలిపారు.

పోక్సో చట్టంపై శిక్షణ

నరసరావుపేట లీగల్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి), పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం డీఎం హెచ్‌వో డాక్టర్ బి.రవి అధ్యక్షతన విద్యాశాఖ, ఐసీడీఎస్, విజువల్లి ఛాలెంజ్ పాఠశాల అధికారులకు పోక్సో చట్టంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి మాట్లాడుతూ 2012లో అమల్లోకి వచ్చిన ఈ చట్టం 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. బాలికలపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినశిక్షలు అమలయ్యేలా ఈ చట్టం రూపొందించబడిందన్నారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారికి జీవిత ఖైదు, పది సంవత్సరాల నుంచి ఏడు సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధిస్తారన్నారు. 16 సంవత్సరాల లోపు బాలికలపై అత్యాచారం జరిగితే కనీసం 10సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ రాజేశ్వరి, డైట్ సెంటర్ అధికారులు, నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

నరసరావుపేట రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా గాయత్రి

నరసరావుపేట లీగల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 18మంది జూనియర్ సివిల్ న్యాయాధికారులను బదిలీచేస్తూ పోస్టింగులు ఇస్తూ మంగళవారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. బదిలీలో భాగంగా నరసరావుపేట రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా మొగురం గాయత్రిని నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. గత కొంతకాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. బదిలీ అయిన, కొత్తగా నియమింపబడిన న్యాయాధికారులు ఏప్రిల్ 1లోగా బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాఠశాలల ఒంటిపూట బడుల సమయంలో స్వల్ప మార్పు

చిలకలూరిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలలో ఒంటిపూట బడుల సమయంలో స్వల్ప మార్పు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ పాఠశాలలలో మధ్యాహ్నం 1-30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతుల నిర్వహణ జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ పరిధిలో 11 కేంద్రాలలో టెన్త్ పరీక్షలు జరుగుతున్నాయి.

యువకుడు ఆత్మహత్య

నరసరావుపేట లీగల్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జిలో యువకుడు ఉరివేసుకుని మృతి చెందినట్లు మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గుడిపాడుకు చెందిన బండ్ల హనుమంతరావు (26)కు నాలుగు నెలల క్రితం నరసరావుపేట మండలం పమిడిమర్రు గ్రామానికి చెందిన యువతితో వివాహం అయింది. మృతుడు హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం చేయలేక ఇటీవల తన అత్తవారింటికి వచ్చిన హనుమంతరావు మంగళవారం ఉదయం పట్టణంలోని వినుకొండ రోడ్డులో లాడ్జిలో దిగి ఉరి వేసుకున్నాడు. సిబ్బంది పిలిచినా బదులివ్వకపోవడంతో లాడ్జి నిర్వాహకులు మొదటి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొదటి పట్టణ పోలీసులు వెళ్లి తలుపులు తెరచి చూసేసరికి ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు ఈ మేరకు మృతుని తండ్రి కనకయ్య నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చరణ్ తెలిపారు.

వ్యక్తిపై దాడి

వినుకొండ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యతరపు బంధువులు భర్తపై దాడిచేసిన సంఘటన ఉప్పరపాలెంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు గ్రామానికి చెందిన గాదం తిరుపాల్‌కు పెద్దరిబ్కా, చిన్న భార్య చిన్న రిబ్కా ఇద్దరు భార్యలు. భర్తతో వచ్చిన మనస్పర్థల కారణంగా ఇద్దరూ పుట్టింటికి వెళ్లారు. దీంతో తిరుపాల్ సోమవారం రాత్రి కాపురానికి తన భార్యలను పంపించాలంటూ అత్తమామలతో ఘర్షణకు దిగాడు. ఈ నేపథ్యంలో జరిగిన ఘర్షణలో భార్యల తరపు బంధువు గాదం శ్రీనివాసరావు తిరుపాల్‌పై కత్తితో దాడి చేయడంతో కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న బంధువులు తిరుపాల్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. జరిగిన సంఘటనపై మొదటి భార్య పెద్దరిబ్కా, చిన్న భార్య చిన్న రిబ్కా, లాజర్, గాదం శ్రీనివాసరావులపై తిరుపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు

ఆటో ఢీకొని విద్యార్థులకు గాయాలు

వినుకొండ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు విద్యార్థులను తరలిస్తున్న ఆటోను మంగళవారం వెనుక నుంచి మరో ఆటో బలంగా ఢీకొంది. దీంతో సాగర్ అనే విద్యార్థితో పాటు మరో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న బంధువులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన సాగర్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు

● ఉదాసీనంగా అధికారులు

నరసరావుపేట టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు అధికం అయ్యాయి అని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై పట్టణ ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. పట్టణంలో ప్రకాష్‌నగర్ రిక్షా సెంటర్ సమీపంలో సాక్షాత్తూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నివాసం ఉండే వీధిలో నిబంధనలు అతిక్రమించి బహుళ అంతస్తుల భవనం నిర్మిసున్నారు. అయినా అధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో సమీపంలో నివాసం ఉండే వారికి కూడా ఇబ్బందులు తలెత్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కేవలం మూడు అంతస్థుల నిర్మాణానికి మాత్రమే అనుమతులు ఉండగా ఇప్పటికే నాలుగు అంతస్థులు నిర్మించి ఓ అంతస్తు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. భవనం చుట్టూ వదలాల్సిన స్థలం కూడా వదలకుండా నిర్మాణం జరిపారని పలు ఆరోపణ వస్తున్నాయి. సెట్ బాక్ లేకుండా భవనం నిర్మిస్తే సమీపంలో నివాసం ఉండేవారికి ఏసీ మిషన్ల నుంచి వచ్చే వ్యర్థాలు వారి భవానాలపై పడే అవకాశం ఉంది. ఈ భవనం నిర్మాణంలో అన్ని రకాల అనుమతులు అతికమించి నిర్మిస్తున్నారని సమీపంలో నివాసం ఉంటున్న జీ షణ్ముఖ కుమార్ మరికొంత మంది అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలిపారు. సంబంధిత అధికారులు నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు అతికమించి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం



ఎమ్మెల్యే చదలవాడకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే అరవిందబాబుకు స్వాగతం పలుకుతున్న కొల్లి బ్రహ్మయ్య, కడియాల తాండవ కృష్ణ, కొప్పూరు బాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు మంగళవారం ఘనస్వాగతం లభించింది. కొండమోడు జంక్షన్ వద్ద టీడీపీ. జనసేన, బీజేపీ నాయకులు భారీగా పాల్గొని స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహించి ర్యాలీగా వస్తూ మార్గమధ్యలో చల్లగుండ్ల అడ్డరోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. రూపెనగుంట్ల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేసి, రావిపాడులోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాకతీయ నగర్ వద్ద మహిళలు హారతులు పట్టారు. పట్టణంలోని శివుడు బొమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మల్లమ్మ సెంటర్ మీదగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నివాసం చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల అధినేత కొల్లి బ్రహ్మయ్య, నరసరావుపేట మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు, రొంపిచర్ల అధ్యక్షుడు పి.జగ్గయ్య, తెలుగు యువత అధ్యక్షుడు ఖాసీమ్, గాడిపర్తి సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మాజీ యార్డు చైర్మన్‌లు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్‌లు, డీలర్‌లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, డీసీ చైర్మన్‌లు, మాజీ సొసైటీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భారీర్యాలీతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అభిమానులు, కూటమి కార్యకర్తలు

పని ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి: పీడీ సిద్దలింగమూర్తి

బొల్లాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని పీడీ సిద్ద లింగమూర్తి సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 16వ సోషల్ ఆడిట్ 2023-24 సంవత్సరానికి గాను మండలంలో 13.81 కోట్లకు జరిగిన అభివృద్ధి పనులపై గత పది రోజులుగా గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించి మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. ఈ ప్రజా వేదికలో ప్రధానంగా పనిప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయటం లేదని, తప్పనిసరిగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, కొన్నిచోట్ల పనులకు వెళ్ళకుండా వెళ్ళినట్టు మస్టర్లు వేసుకుంటున్నారని సోషల్ ఆడిట్ బృందం పీడీ దృష్టికి తీసుకు వచ్చింది. మస్టర్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయాలని పీడీ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. నూతనంగా ఎంపికైన ఫీల్డ్ అసిస్టెంట్‌లు జిల్లా అధికారులు మీటింగ్‌కు వచ్చినా రాక పోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు పెట్టిన మీటింగ్‌కే రాలేని ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో వారు పనులు ఏం కల్పిస్తారని?, అలా రాని వారి స్థానంలో వేరే వారిని నియమించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని, పనుల సమయంలో ఉపాధి కూలీలకు టెంట్, నీటి వసతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ప్రజా వేదికలో పనులకు సంబంధించి 33 పంచాయతీల్లో రూ.28,754 రికవరీ రావటం జరిగిందన్నారు. రూ.51,99,459లకు పనులను మరలా పరిశీలించటం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో ఏపీడీ ఈ బూసిరెడ్డి, ఎంపీడీవో పీ సీతారామయ్య, ఎంపీపీ బత్తి రాములు, క్వాలిటీ కంట్రోల్ ప్రభాకర్, విజిలెన్స్ డీ విజయలక్ష్మి, ఎస్‌ఆర్‌పీ జే రాజు, ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పోలీసులకు సవాలుగా దోపిడీలు

వృద్ధురాలి హత్యపై ప్రజల్లో భయాందోళనలు

వినుకొండ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో జరుగుతున్న దోపిడీలు పోలీసులకు సవాలుగా మారుతున్నారు. ఇటీవల వరుస దొంగతనాలు, వృద్ధులను హతమార్చి దోపిడీలకు పాల్పడుతున్న తీరుపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నారు. వినుకొండ పట్టణంలో సోమవారం రాత్రి వృద్ధురాలిని హత్యచేసి బంగారం దోచుకెళ్లిన సంఘటన పెనుసంచలనంగా మారింది. పట్టపగలు జనసంచారం ఉన్న కొత్తపేట గీతాంజలి పాఠశాలకు ఆనుకొని ఉన్న కొప్పురపు సావిత్రి నివాసం ఉంటున్న గృహంలోకి వెళ్లి ఆమె ఒంటిపై ఉన్న చీర చెంగుతో నోటిని అదిమి హత్య చేసి బంగారం దోచుకెళ్లిన సంఘటన పోలీసులకే సవాల్‌గా మారింది. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు సంఘటనా ప్రాంతానికి చేరుకొని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో అనుమానితులను గుర్తించేందుకు ప్రయత్నం చేపట్టినప్పటికీ ఫలితం కనిపించలేదు. సోమవారం రాత్రి సావిత్రమ్మ నివాసం ఉన్న గృహం నుంచి పోలీస్ జాగిలం నేరుగా గీతాంజలి స్కూల్ వెనుక వైపు ఉన్న రామాలయంవీధిలో నుంచి సురేష్ మహల్ మీదుగా నరసరావుపేట రోడ్డుకు చేరుకుంది. కొంతసేపు తుమ్మా రామిరెడ్డి విగ్రహం వెనుక వైపు తచ్చాడి వినుకొండ నుంచి నరసరావుపేట వైపు పోవు మార్గంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద వరకు జాగిలం చేరుకుంది. జరిగిన ఉదంతంపై జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం సంఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలోని సావిత్రమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. 2024 జూన్ 19వ తేదీన సంఘటనా ప్రాంతానికి కూతవేటు దూరంలో ఇదే తరహాలో పి.కోటిరత్నమ్మను సైతం హత్యచేసి బంగారం దోచుకెళ్లారు. ఈ సంఘటన మరువకముందే పట్టణంలో మరో వృద్ధురాలి హత్య జరగటం పట్టణవాసులను భయాందోళనకు గురిచేసింది. సావిత్రమ్మ శరీరంపై ఉన్న బంగారపు గొలుసు, మాటీలు, మూడు ఉంగరాలు మొత్తం 4 నుంచి 5 సవర్ల బంగారాన్ని దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. చేతికి ఉన్న గాజులను మాత్రం ఆమె దిండు కింద లభించాయి. సంఘటనను ఛేదించేందుకు మంగళవారం క్లూస్ టీమ్ నేరస్థులను పట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. స్థానికులే ఈ సంఘటనకు పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సీసీ కెమెరాల సాయంతో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు రాత్రినుంచి వినుకొండలో మకాం వేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



సంఘటనా ప్రాంతంలో జాగిలం సాయంతో ఆధారాలు సేకరించే ప్రయత్నం చేస్తున్న పోలీసులు

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

● పీడీకి వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి రవి వినతి

నరసరావుపేట రూరల్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): పగటిపూట ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, పని ప్రదేశాలలో ఉపాధి కూలీలకు సరైన సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని మంగళవారం రామిరెడ్డిపేటలోని పీడీ కార్యాలయంలో డ్వామా పీడీ సిద్దలింగమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కూలీలకు పని ప్రదేశాలలో వసతులు కల్పించడం లేదన్నారు. కొద్ది రోజులలో కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడం వ్యవసాయ పనులు ముగియడం తదితర కారణాలతో కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. కూలీలు వలసలు నివారించేందుకు కొత్త పనులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ కూలీలు పని చేసి నెలలు కావస్తున్న వేతనాలు అందుకే ఇబ్బంది పడుతున్నారని వెంటనే వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాలకతీతంగా కూలీలకు పనులు చూపించాలని కోరారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, నీడ కోసం కోసం టెంట్లు, పే స్లిప్పులు ఇవ్వాలని పని దినాలు పెంచి వేసవి అలవెన్సులు పనిముట్లు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన డ్వామా పీడీ ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య, జిల్లా నాయకులు కొమ్ముల నాగేశ్వరరావు, జమండ్లమూడి భగత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్: ఏఎస్పీ

నరసరావుపేట లీగల్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు శక్తి యాప్ ఒక రక్షణ కవచం లాంటిదని పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ప్రతి ఒక్క మహిళ ఫోన్లో ఈ యాప్‌ను నిక్షిప్తం చేసుకొని ఆపద సమయంలో పోలీసుల సాయం పొందవచ్చు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికలు భద్రత కోసం ఈ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క మహిళ విద్యార్థులు బాలికలు ఉద్యోగులు వారి వారి ఫోన్లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా శక్తి వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, 500మంది విద్యార్థులు, మహిళా ఎస్ఐలు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట బజార్‌లోని పులుపులవారి వీధిలో ఉన్న వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసినట్లు మిటీ సభ్యుడు కోపూరు శివశ్రీనుబాబు మంగళవారం తెలిపారు. తవ్వా వెంకట కోటేశ్వరరావు, లక్ష్మీకుమారి దంపతులు, వారి కుమారుడు శ్రీనివాసరావు, యామిని కన్యాకుమారి దంపతులు రూ.3 లక్షలు ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వనమా కృష్ణ, వనమా సాంబశివరావు, మున్నలూరి సత్యనారాయణ, గట్ట వెంకట శ్రీనివాసరావు, ఏసిరెడ్డి సుబ్బారెడ్డి, రాచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట డివిజన్ కార్యాలయంలో రేపు విద్యుత్ అదాలత్

నరసరావుపేట టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో 20న విద్యుత్ అదాలత్ జరుగుతుందని ఈఈ చేజర్ల రాంబొట్లు మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జరిగే విద్యుత్ అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్‌తో పాటు ఇతర అధికారులు హాజరు అవుతారన్నారు. వినియోగదారులు తమ సమ్యసలు లిఖిత పూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

నాటు సారా నివారణపై అవగాహన

బొల్లాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు నవోదయ - 2 కార్యక్రమంలో భాగంగా ఈపూరు ప్రొహిబిజన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం అనుమానిత ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గండి గనుముల, బోడిపాలెం తండా, బ్రిడ్జి తండా, ఎనిమిది తండాల్లో గ్రామస్థులను కలిసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు, కే.శ్రీనివాసరావు, పీ సురేష్, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి: డీడీఏ

రొంపిచర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని డీడీఏ శివకుమారి తెలిపారు. మండలంలోని వడ్డమూడివారిపాలెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఉన్న మట్టిని పరీక్ష చేయించుకొని ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, ఏవో శివ లలిత, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారమిస్తాం

● జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరే

నరసరావుపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చీరాల ఓడరేవు నుంచి నకరికల్లుకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించటం జరుగుతుందని పల్నాడు జిల్లా సూరజ్ ధనుంజయ్ ఘనోరే తెలిపారు. నరసరావుపేట మండలం రావిపాడులో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం ఆర్డీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన రహదారుల విస్తరణ వేగవంతంగా జరుగుతుందని రాష్ట్ర అభివృద్ధికి రహదారుల అభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని రావిపాడు గ్రామ రైతులందరూ జాతీయ రహదారి నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో మధులత తహసీల్దార్ వేణుగోపాలరావు రావిపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

● సిబ్బందికి కమిషనర్ ఆదేశం

చిలకలూరిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్ను బకాయిల వసూలు వేగవంతం చేయాలని రెవెన్యూ సిబ్బందిని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు మంగళవారం ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలకు సంబంధించిన రూ.21లక్షల విలువ కలిగిన 4 చెక్కులు మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీహరిబాబుకు రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, అడ్మిన్ షేక్ కరిష్మాలు అందచేశారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ నెలాఖరుకు నూరు శాతం పన్నులు వసూలు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. పట్టణంలో 29 సచివాలయల పరిధిలో పన్ను వసూళ్లకు ప్రధాన అవరోధంగా మొండి బకాయిలు ఉన్నాయని, భవనాలు నిర్మించి వదిలిపెట్టిన యాజమాన్యాలు, ఆచూకీ లేని సంస్థల ఆస్తులపై పన్నులు వసూలు చేయడం కష్టతరంగా మారిందన్నారు. పలు విద్యాసంస్థలు సైతం పన్నులు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపుతున్నాయని, పన్ను వసూళ్లు జరిగితేనే పట్టణాభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు, పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు గైకొంటామని చెప్పారు. పన్ను వసూలుపై ప్రతిరోజు సమీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పన్నులు చెల్లించని వారి ఇంటి నీటి కుళాయి కనెక్షన్ తొలగించడమే కాకుండా, నోటీసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



బకాయి మొత్తం చెక్కులను కమిషనర్‌కు అందచేస్తున్న మునిసిపల్ ఆర్వో, ఆర్ఐ

బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ఈపూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ఏపీ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ భవనం నిర్మాణానికి రూ.1.79కోట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఈఈ కేవీ నాగజ్యోతి, డీఈ కే హరిబాబులతో కలిసి వసతి గృహం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న మోడల్ స్కూల్ భవనం సమీపంలోనే హాస్టల్‌ను నిర్మించేలా అంచనాకు వచ్చారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు



పోటీల్లో పాల్గొన్న టీజీ భరత్, పుల్లారావు

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రత్తిపాటి, భరత్ జట్టు విజయం

చిలకలూరిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులకోసం మూడురోజుల పాటు నిర్వహిస్తున్న సాంస్కృతిక, క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం తొలి రోజున విజయవాడలోని డీఆర్ఆర్ మునిసిపల్ ఇండోర్‌స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రి టీజీ భరత్ ఒక జట్టుగా, వసంత కృష్ణ ప్రసాద్, పితాని సత్యనారాయణ మరొక జట్టుగా ఆడారు. పోటీలో ప్రత్తిపాటి, భరత్ జట్టు విజయం సాధించింది. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రభుత్వం క్రీడా, సాంస్కృతి పోటీలు నిర్వహించాలనే సభాపతి అయ్యన్నపాత్రుడి ఆలోచనను స్వాగతిస్తున్నామన్నారు.

షాదీఖానాలో ఇఫ్తార్

నరసరావుపేట టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదీఖానాలో ఈశ్వర్ గ్రూప్ కంపెనీల అధినేత, మాజీ మునిసిపల్ చైర్మన్ షేక్ మీరావలి ఆధ్వర్యంలో 2 వేల మందికి ఇఫ్తార్ ఏర్పాటు చేశామని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరిమ్ మొహిద్దీన్ మంగళవారం తెలిపారు. షేక్ దాదా సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 39 సంవత్సరాలుగా ఇఫ్తార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవీంద్ర, కొల్లి బ్రహ్మయ్య, పులిమి వెంకట రామిరెడ్డి, తదితరులు పాలొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలి

● మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్

నరసరావుపేట టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ డిమాండ్ చేశారు. మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రంలో వేసిన వన్‌మెన్ కమిషన్ నివేదికను క్యాబినెట్ ఆమోదం తెలపటాన్ని మాల మహానాడు వ్యతిరేకిస్తూ నల్ల రిబన్లుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి వర్కింగ్ అధ్యక్షుడు విస్సాల జయరావు అధ్యక్షత వహించారు. నిరసన కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రు విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రపాటి ఎర్రయ్య, పాశం శ్యామ్, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, మెడబలిమి సాంబశివ, చిట్టిమాల మేరీ, జైభీమ్‌రావు భారత్ పార్టీ జూలూరి రమేష్, వనపర్తి ఏసుబాబు, మాతంగా సుధాకర్, బొందలపాటి నాగేశ్వరరావు, పిడతల రాజు, కీర్తిపాటి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏకో నారాయణ స్వామి తిరునాళ్ళ

బొల్లాపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని ఏకో నారాయణస్వామి తిరునాళ్ళ బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, భారీ అన్నదాన కార్యక్రమాలు చేయనున్నారు. గ్రామంలో నాలుగు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి రానుండటంతో వారి సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.